ప్రజాశక్తి

సోమవారం 6 మే 2024

I

అల్లూరి సీతారామరాజు

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అడుగడుగునా పోలీస్ బలగాలు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. మండలంలోని నేతాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో తాత్కాలిక చెక్ గేట్ వద్ద ఆదివారం జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్ వాహనాలను తనిఖీలు చేపట్టారు. వాహనదారుల రాకపోకలపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో స్థానిక ఎస్సై రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

బిజెపి, పొత్తు, తొత్తు పార్టీలను ఓడించండి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి- రంపచోడవరం

బిజెపి, దాంతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలను, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని, ఇండియా వేదిక పార్టీల అభ్యర్థులను గెలిపించాలని పలువురు ప్రముఖులు ప్రజలకు పిలుపునిచ్చారు. 'భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' పేరిట రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన ఆదివారం రంపచోడవరంలో సిపిఎం నాయకులు మట్ల వాణిశ్రీ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఇందులో ముఖ్య వక్తగా పాల్గొన్న రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీలోని సహజ సంపదలను, ఖనిజాలను అంబానీ అదానీలకు కట్టబెట్టేందుకు బిజెపి మోడీ ప్రభుత్వం అటవీ సంరక్షణ చట్టాన్ని సవరిస్తే దానికి పార్లమెంట్‌లో టిడిపి, వైసిపి ఎంపీలు మద్దతు తెలియజేశారని తెలిపారు. బిజెపి సిఎఎ అమలు చేస్తామంటే ఆ రెండు పార్టీలు వత్తాసు పలుకుతున్నాయన్నారు. రాష్ట్రంలోని టిడిపి, జనసేన, వైసిపి ఈ మూడు పార్టీల్లో ఏ పార్టీకి ఓటు వేసిన అది బిజెపికే చెందుతుందని చెప్పారు. అందువల్ల ప్రజలు ఆలోచించి ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి లోత రామారావుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆదివాసీల కోసం పోరాడే నాయకులు అసెంబ్లీ పార్లమెంటులో ఉంటే ప్రజా వ్యతిరేక చట్టాలు అమలు కాకుండా అడ్డుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వామపక్షాల కృషి వల్లే 1/70, పీసా, అటవీ హక్కుల సంరక్షణ వంటి చట్టాలు, జీవో నెంబర్ 3, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వచ్చాయని గుర్తు చేశారు. దేశ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడమే దేశభక్తి అని చెబుతున్న మోడీ ప్రభుత్వాన్ని ఓడించి, ఇండియా వేదికను గెలిపించడమే నిజమైన దేశభక్తి అని పేర్కొన్నారు.

రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ఇప్పటివరకు చరిత్రలో నరేంద్ర మోడీ అంతటి అవినీతిపరుడు ఎవరూ లేరని ఎలక్టోరల్ బాండ్‌ల సందర్భంగా తేలిందన్నారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కో-కన్వీనర్ కె.విజయరావు మాట్లాడుతూ బిజెపి పరిపాలనలో గత పదేళ్ల కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిందన్నారు. ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పట్ల చాలా అవమానకరంగా ప్రవర్తిస్తున్నారని, పార్లమెంటు భవనం, ఆయోధ్య రామాలయం ప్రారంభోత్సవాల సమయంలో రాష్ట్రపతికి ప్రోటోకాల్ ప్రకారం ఇవ్వవలసిన గౌరవం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ ఇండియా కూటమి ఎపిలో మొట్టమొదట గెలిచే ప్రాంతం రంపచోడవరం నియోజకవర్గమని తెలిపారు. మోడీ గొప్పగా చెప్పే గుజరాత్‌లో పేదరికం 18 శాతం ఉంటే, కమ్యూనిస్టులు పరిపాలిస్తున్న కేరళలో కేవలం 0.75 శాతం మాత్రమే ఉందని, భారత దేశంలోనే నిరుపేదలు లేని ఒకే ఒక్క రాష్ట్రం కేరళ అని పేర్కొన్నారు. కేరళలో గడిచిన ఐదేళ్లలో 2,76,000 మందికి ఉపాధి కల్పిస్తే, గుజరాత్‌లో కేవలం 6000 మందికి మాత్రమే ఉపాధి అవకాశాలు వచ్చాయని తెలిపారు. బిజెపి చెప్పే అభివృద్ధి బూటకమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఎఎస్ అధికారి మండల బండ్ల శ్రీనివాస్, విశ్రాంత ప్రిన్సిపల్ మనోహరమ్మ, ఎఐఎడబ్ల్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ రంపచోడవరం మండల అధ్యక్షులు మక్కా బాలు, కొండమదులు సర్పంచ్ విజయ, వివిధ ప్రజా సంఘాలు, మైనార్టీ మత పెద్దలు, ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు, చిత్రంలో రాజాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, కో- కన్వీనర్ విజయరావు, ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

-ఓటు హక్కును వినియోగించుకున్న 1222 మంది ఉద్యోగులు

- హోమ్ ఓటింగ్‌ల్లో పాల్గొన్న 68 మంది

-కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించిన వివిధ కేటగిరీల అధికారులు, సిబ్బంది 1222 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆదివారం వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత తెలిపారు. మరో 68 మంది 85 సంవత్సరములు పైబడిన వయసు గల ఓటర్లు, పిడబ్ల్యుడి ఓటర్లు హెూమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నారని తెలిపారు. అరకు వ్యాలీ నియోజకవర్గం లో 288 మంది పోస్టల్ బ్యాలెట్, పాడేరు నియోజకవర్గంలో 387 మంది పోస్టల్ బ్యాలెట్, 37 మంది హెూమ్ ఓటింగ్, రంపచోడవరం నియోజకవర్గం లో 547 మంది పోస్టల్, 24 మంది హెూమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వివరించారు.

అరకు లోయ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండవ రోజు 288 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారని అరకు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగు ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీఓ స్వయంగా దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఆదివారం స్థానిక కంఠభౌంసుగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 288 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన 267 మంది, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి 12మంది, ఇతర జిల్లాల నుంచి 9 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఓటు హక్కును వినియోగించు కున్నారని వెల్లడించారు. రెండు రోజుల్లో 413 మంది ఉద్యోగులు ఓటింగ్ లో పాల్గొన్నారని చెప్పారు. ఈనెల 8వ తేదీ వరకు అరకు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు విధులు నిర్వర్తించే ఇతర జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా బ్యాలెట్ ఓటింగ్ సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎనిమిదవ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అదేవిధంగా 44 మంది హెూమ్ ఓటింగ్ సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. రంపచోడవరం, పాడేరు, అరకు వ్యాలీ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావుాల్గొన్నారు.

అరకులోయలో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న పిఒ

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలి

రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ

ప్రజాశక్తి -దేవీపట్నం

సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ పిలుపునిచ్చారు. సిపిఎం అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరుతూ మండలంలోని నేల దొండపాడు గ్రామంలో ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు కేంద్రంలోని బిజెపి, మోడీ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాన్ని అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడానికి కుట్ర చేస్తుందని, దానిని అడ్డుకోవాలంటే ఎర్రజెండా వారసులుగా ఉన్న లోతా రామారావు, అప్పలనర్సను గెలిపించి చట్టసభలకు పంపించాలని కోరారు. ఇలా రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. సిపిఎం, రైతు కూలి సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సభలో పాల్గొన్న రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ, వడ్డే, ఐవి, వి.వెంకటేశ్వర్లు తదితరులు

నేడు సిపిఎం బహిరంగ సభ

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ (ఇండియా వేదిక) పార్టీలు, సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఆదివాసీ సంఘాలు బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ ఈ నెల 6న సోమవారం సాయంత్రం 4 గంటలకు రాజవొమ్మంగి నూకాలమ్మ తల్లి గుడి వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల నాయకులు కోండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, వీరబాబు తెలిపారు. ఈ సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని, సిపిఎం, కాంగ్రెస్, ఆదివాసీ సంఘాల నాయకులు కూడా మాట్లాడుతారని పేర్కొన్నారు. ఈ మేరకు బహిరంగ సభను విజయవంతం చేయాలంటూ సిపిఎం నాయకులు ఆదివారం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు వివేక్ నందన్

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

సాధారణ ఎన్నికల పరిశీలకులు వివేక్ నందన్

ప్రజాశక్తి -రంపచోడవరం

ఈనెల 13వ తేదీన జరుగు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జనరల్ ఎన్నికల పరిశీలకులు కె.వివేక్ నందన్ పేర్కొన్నారు. ఆదివారం డిగ్రీ కాలేజీ సమీపంలో హెలీప్యాడ్ ల్యాండింగ్ ప్రాంతాన్ని, స్ట్రాంగ్ రూమును, పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్న రూములను, ప్రొసీడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులకు శిక్షణను ఆయన పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లతో మాట్లాడారు. ఎన్ని రూములలో పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు చేశారు, ఎంతమంది సిబ్బందిని నియమించారో పోస్టల్ బ్యాలెట్ కొరకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నదీ పరిశీలకులు ఆరా తీశారు. ఈ నియోజకవర్గంలో 4,457 మంది పోస్టల్ బ్యాలెట్ కొరకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా వివేక్ నందన్ మాట్లాడుతూ ఎన్నికల అధికారులకు సిబ్బందికి వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసి, అందులో ఎన్నికలకు సంబంధించిన వివరాలన్నీ పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. అధికారులు సిబ్బంది చాలా జాగ్రత్తగా ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఏవి రమణ, సత్యనారాయణ, నాగరాజు, జ్యోతికృష్ణ, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు, ఎ. సత్యనారాయణ, స్వామి, బాలాజీ, శ్రీధర్, శివ, విశ్వనాథ్, సరిత, వీరభద్రరావు, ఎన్‌వి సత్యనారాయణ, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

145 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-రంపచోడవరం

రంప చోడవరం ఎస్ఈబి సిఐ ఇంద్రజిత్తు, ఎస్సై అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యాన వై.రామవరం మండలం బొడ్డుమామిడి గ్రామంలో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇతర రాష్ట్రానికి చెందిన మద్యాన్ని (ఎన్‌డిపిఎల్) అక్రమంగా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, ఆయన నుండి 145 సీసాలు (26.265 లీటర్ల మద్యం, 24.5 లీటర్ల బీర్)ను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, నిందితుడుతో ఎస్ఇబి అధికారులు, సిబ్బంది

అధికారులు ఎన్నికల విధుల్లో... ఆక్రమణదారులు నిర్మాణ పనుల్లో...

-ఎండపల్లివలసలో జోరుగా అక్రమ కట్టడాలు



అక్రమంగా నిర్మిస్తున్న కట్టడం

ప్రజాశక్తి- అరకు రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండలంలోని ఎండపల్లి వలసలో 1/ 70 చట్టాన్ని ఉల్లంఘించి విచ్చలవిడిగా గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యు, పంచాయితీ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు, షాపులపై షాపులు అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నా పంచాయతీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు ఎన్నికల బిజీలో ఉండటంతో ఇదే అవకాశం అని భావించి కొంతమంది గిరిజనేతరులు జోరుగా అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారి పక్కన బహుళ అంతస్తులు, దుకాణాల అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై గిరిజన ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు అరికట్టాలని ఎన్నిసార్లు సంబంధిత రెవెన్యూ అధికారులకు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకునే నాధుడు కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు అరికట్టకపోతే జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఏ పిఓ దృష్టికి తీసుకెళ్తామని ఆదివాసి గిరిజన ప్రజా సంఘాలు తెలిపారు.

అక్రమ కట్టడాలు నిలిపేయాలి

అరకులోయ మండలంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలు పెరిగి పోతున్నాయి. ఎన్నిసార్లు పంచాయతీ, రెవెన్యూ అధికారులకు విన్నవించినా కనీసం పట్టించుకునే దాఖలు లేవు. బినామీ పేరుతో లాడ్జిలు, దుకాణాలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని కాపాడవలసిన అధికారులే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరు కాపాడుతారు.

గత్తుం బుజ్జిబాబు.
ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు

రోడ్లు నిర్మిస్తేనే ఓట్లు వేస్తాం

పివిటిజిల వినూత్న నిరసన



గుర్రాలతో నిరసన చేపడుతున్న పివిటిజిలు

ప్రజాశక్తి-అనంతగిరి: తమ పివిటిజీ గ్రామాలకు రోడ్లు వేస్తేనే ఓట్లు వేస్తామని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని గుర్రలెక్కి వినూత్న రీతిలో పివిటిజీలు నిరసన చేపట్టారు. మండలంలోని మద్రేబు, దాయార్తి గ్రామాలకు చెందిన పివిటిజిలు ఆదివారం గుర్రలెక్కి వినూత్న రీతిలో నిరసన చేపడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పివిటిజి ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కె.నర్సింగరావు, కె.దాసు, ఎస్.సుధాకర్‌లు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా పివిటిజీ గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. పివిటిజిల సంక్షేమం, అభివృద్ధికి కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు ప్రకటలకే పరిమితమయ్యాయన్నారు. కనీసం రోడ్డు సౌకర్యం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మద్రేబు గ్రామంలో 45 కుటుంబాలు 170 జనాభా, 70 మంది ఓటర్లు ఉన్నామని, పెద్దకోట పంచాయతీ పెద్దకోట, వేలమామిడి పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేందుకు 30 కిలో మీటర్లు వెళ్ళవలసి ఉంటుందని తెలిపారు. 2017, 2022 సంవత్సరంలో రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి చేయకుండా వదిలి వేసారని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారన్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జీపు, బైక్ ఢీ : వ్యక్తి మృతి

ప్రజాశక్తిపాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఘాట్ రోడ్‌లో ఆదివారం ఉదయం జీపు, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పాడేరు మండలం గడ్డంపుట్టు గ్రామానికి చెందిన ముడువా సింహాచలం ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై పాడేరు వస్తున్నాడు. మైదాన ప్రాంతం వెళ్తున్న జీపు డైమండ్ పార్క్ జంక్షన్ సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పై వస్తున్న సింహాచలంకు తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డుపై బైకిస్టు మృతదేహం

సిపిఎం అభ్యర్థుల గెలుపునకు విస్తృత ప్రచారం

దేవీపట్నం మండలంలో ప్రచారంలో పాల్గొన్న లోతా రామారావు తదితరులు

ఇండియా ఫోరం బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మన్యం ప్రాంతంలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

దేవీపట్నం : రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్, సిపిఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు బలపర్చిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. మండలంలోని పెద్ద భీంపల్లి ఇందుకూరుపేట, పోతవరం, అగ్రహారం కాలనీ తదితర గ్రామాల్లో ఆదివారం రామారావు రోడ్‌షో, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు పాడేరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 24 గంటలు సమయం పడుతుందని, దీంతో ఈ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడుతూ ప్రజల మధ్యలో ఉండి ప్రజల సమస్యలు తెలిసిన సిపిఎం నాయకులను ఎన్నుకుంటే నియోజకవర్గ, జిల్లా అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. పోలవరం సమస్యపై కూడా పోరాట చేసిన అనుభవం తనకు ఉందన్నారు. కనుక సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జి.వెంకట్రావు, పి.రామకృష్ణ, జి.సూర్య కిరణ్, కె.విజయలక్ష్మి, వి.సాయి, ఎస్.సాయి, జె.గోపి, పి.చంటి, బుల్లెమ్మ, బేబీ పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని నారాయణపురం, వేగితోట గ్రామాల్లో ఆదివారం సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. గిరిజన హక్కులు, చట్టాలు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం వంటివి కమ్యూనిస్టు అభ్యర్థులు మాత్రమే పోరాటాలు చేసి సాధిస్తారని, వారిని ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి, సీసం సురేష్, నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్‌రావు, మొట్టం, రాజయ్య, పొడియం, లక్ష్మణ్, సోడి రాజయ్య, సాలం పంతులు, పాండ్రు సుబ్బారావు. మాజీ ఎంపీటీసీ పాండ్రు పొద్దయ్య. కారం రాజయ్య, అర్జున్, సుందర్, బట్ట రాములమ్మ, కారం వెంకటేష్ పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావను, ఎంపీగా పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు రమేష్, సుబ్బారావు, శేషు, సూరయ్య, సత్యనారాయణ, గంగరాజు, సరిత, కాంగ్రెస్ నాయకులు బొద్దేలా కృష్ణ, సీతయ్య, సిరమ్మయ్య, గంగరాజు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని కన్నయిగూడెం, తాటాకుల గూడెం, గొమ్ము కొత్తగూడెం, గొమ్ము కోయగూడెం, గోగుబాక గ్రామాల్లో సిపిఎం నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత పదేళ్లుగా విలీన గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, మళ్లీ సిపిఎం గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల నాయకులు సోందే రామారావు, ఆకిశెట్టి రాము, ప్రసన్న కుమార్, ఇరపా సత్యం, వీరమ్మ, రాంబాబు, సమ్మక్క పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని గండి కొత్తగూడెం, పల్లూరు, అయ్యవారిగూడెం, కొండాయిగూడెం గ్రామాల్లో సిపిఎం నాయకులు ఆదివారం వేర్వేరుగా ప్రచారం చేశారు. పోఅవరం నిర్వాసితుల పక్షాన మొదటి నుండి పోరాడే సీపీఎంను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం తెలంగాణ నాయకులు కారం పుల్లయ్య, పాయం సత్యనారాయణ, ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచి నాగమణి, జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి సీతారామయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీమంతుల వెంకటరమణ, ఎంపీటీసీ జయసుధ, ఆవుల ఉపేంద్ర, మురళి, కర్నాటి శ్రీనివాసరావు, బాబు పాల్గొన్నారు.

అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని...

సీలేరు : ఇండియా వేదికి బలపర్చిన సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స పాచిపెంటను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ పరిధి ఎ.దారకొండ, చిలకవీధి, నల్లముక్కు గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ నెల 8న చింతపల్లిలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. జీకే వీధి మండలం జెర్రిల వారపు సంతలో సిపిఎం మండల నాయకులు జి.సత్యనారాయణ ఆధ్వర్యాన విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏ దారకొండ సర్పంచ్ ఎం.రామారావు, సిపిఎం మండల నాయకులు మురళి, ఎం.చంటిబాబు, రామారావు, లక్ష్మయ్య, పండు, బూడిద రామారావు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: అరకు సీపీఎం ఎంపీ అభ్యర్థి పాచి పెంట అప్పలనర్సకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ నేత కొర్ర త్రినాధ్ యువతకు పిలుపునిచ్చారు. మండలంలోని బుంగపుట్టు గ్రామ పంచాయితీ గర్రంగాటి వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాధ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1/70 చట్టం, ఆదివాసీల హక్కులు, చట్టాలను సర్వనాశనం చేస్తున్న బీజేపీ, తొత్తులైన టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు టి.గణపతి, భరత్, సోంబ్ర పాల్గొన్నారు.

అరకులోయరూరల్: మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో సిపిఎం నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ, ఇండియా ఫోరం అభ్యర్థుల గెలుపుతోనే జిఓ 3కు చట్టబద్ధత సాధ్యమన్నారు. ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలు చేసి రోజు కూలీ రూ.400 వచ్చే విధంగా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పి.బాలదేవ్, కె రామారావు, సుంకరమెట్ట సర్పంచ్ జి.చిన్నబాబు, మగ్గన్న, జగన్నాథం, జయ, కాంగ్రెస్ నాయకులు బాబూరావు, ముత్యాలమ్మ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అరకు పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సిపిఎం ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్సకు, కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్ స్వామికు ఓటు వేసి గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే.సురేంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని కంద్రుం పంచాయతీ జోడిగుడ, సర్రాయి, ఒంబిలో సిపిఎం నాయకులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గిరిజన ప్రాంతాల్లో మైనింగ్ మీద ఉన్న ప్రేమ, గిరిజన ప్రాంతం అభివృద్ధిపై బిజెపి, వైసీపీ, టీడీపీకు లేదన్నారు.గిరిజన ప్రాంతం సమగ్ర అభివృద్ధి ఇండియా బ్లాక్ తోనే సాధ్యమన్నారు. జిఓ 3పై బిజెపి, వైసీపీ ప్రభుత్వం కనీసం రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని చెప్పారు.

సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు ఆధ్వర్యంలో కించమండ, కోసంగుడ, గౌలిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పి.సురేష్ కుమార్, టి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, రామచందర్, పారన్న పాల్గొన్నారు.

చింతపల్లి: మరోసారి కేంద్రంలో బిజెపి గెలిస్తే దేశానికి చాలా ప్రమాదమని సిపిఎం చింతపల్లి మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ అన్నారు. మండలంలోని లంబసింగి పంచాయతీ లో ప్రచారం నిర్వహించారు. బిజెపితో టిడిపి, జనసేన జతకట్టి రాష్ట్రానికి మరింత అన్యాయం చేయడానికి పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నేతలు మర్రి నాగేంద్రకుమార్, పాంగి భాస్కరరావు, సుందర్‌రావు, సిదరి సత్తిబాబు, పాంగి శ్రీను, సూర్యారావు పాల్గొన్నారు.

కూనవరం మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

డుంబ్రిగుడ మండలంలో ప్రచారం చేస్తున్న కిల్లో సురేంద్ర

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి-చీడికాడ: మాడుగుల నియోజకవర్గం ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు ఎన్నిక ప్రచారంలో జోరు పెంచారు. చీడికాడ మండలంలో ఆదివారం సిడిపల్లి, తురువోలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎన్నో సుస్థిరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని శ్రీనివాస్ అన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే దేశం అభివృద్ధి దిశగా బాటలు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ దేముడు నాయుడు పాల్గొన్నారు

గ్రామాల్లో బండారు ప్రచారం

ప్రజాశక్తి -చీడికాడ: సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారంలో దూకుడు పెంచాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాడుగుల కూటమి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి పార్టీ సీనియర్ నాయకులు పైల ప్రసాద్ రావు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే రామానాయుడుతో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. చీడికాడ మండలం వరహాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనని గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత గ్యాస్, ఉచిత ఆర్టీసీ బస్సు, తల్లికి వందనం కింద 15 వేలు రైతులకు 20 వేలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని కైలాసపట్నం గ్రామ శివారు గిరిజన గ్రామం రాజగోపాలపురంలో గడిచిన పది రోజులుగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సచివాలయం, గ్రామీణ నీటి సరఫరా అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆదివారం ఆందోళన చేపట్టారు.గ్రామంలో సుమారు 50 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. తాగునీరు అందక పోవడంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సరఫరా పునరు ద్ధరించాలని కోరుతున్నారు.

దాడులు సరికాదు : అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: దేవరాపల్లి మండలం తారువా గ్రామంలో బిజెపి నాయకులపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ కూటమి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. ఇంత జరుగుతుంటే అక్కడి పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్డీఏకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బూడి ముత్యాలనాయుడు ఓటమి భయంతో దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఇది పద్ధతి కాదన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి -నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో 1414మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేయనున్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు 6 పోలింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈనెల 6 ,7, 8 తేదీల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేయవచ్చు. ఇందుకు గాను అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గెలిపిస్తే రోడ్డు విస్తరణ పూర్తి చేస్తా : పెట్ల

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: మళ్లీ తనను గెలిపిస్తే నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ పూర్తి చేస్తామని నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నర్సీపట్నం అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పూర్తయిన రోడ్డును ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఈ రోడ్డు విస్తరణ చేసి మోడల్ రోడ్డుగా తీర్చిదిద్దామన్నారు. ఈ రోడ్డును ప్రారంభించినప్పటి నుంచి అయ్యన్న పాత్రుడు ఎన్నో అడ్డంకులు తీసుకు వచ్చారన్నారు. చాలా మంది కోర్టులో వేశారన్నారు. అయినా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చాలనే ఏకైక ఉద్దేశ్యంతో ఎంతో ధైర్యంగా ఈ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మరలా ఈ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మిగతా రోడ్డును కూడా పూర్తి చేసి చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు శివాలయం వీధి గ్యాస్ గొడౌన్ సమీపంలో ఉన్న 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ఇంటర్నల్ విభాగంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో విద్యుత్ సరఫరాలో వోల్టేజ్ సమస్య తరచూ ఏర్పడడంతో వినియోగదారులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ సత్యానంద ఆనంద్ ప్రసాద్, ట్రాన్స్కో లైన్మెన్ రాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించరూ...

తిమ్మరాజుపేట గ్రామ కూలీల వేడుకోలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించాలని ఆ గ్రామానికి చెందిన కూలీలు కోరుతున్నారు. ఈ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టకపోవడంతో100 మందికి పైగా కూలీలు రోజూ పని లేక ఖాళీగా ఉంటున్నామని చెబుతున్నారు. గత సంవత్సరం కష్టపడి ఎండలలో పనిచేసిన కూలీలకు నేటి వరకు పనిచేసిన కూలి డబ్బులు రాలేదని మరికొందరు చెబుతున్నారు. ఒకవైపు చేసిన పనికి డబ్బులు ఇవ్వక, ఈ సంవత్సరంలో పనులు ప్రారంభించక ఉపాధి కూలీల గోల పట్టించుకునే నాధుడు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. ఓట్ల కోసం అయితే వస్తున్నారు కానీ తమకు రావలసిన ఉపాధి కూలి సొమ్ము ఇప్పించడానికి ఎవరు రావడంలేదని చెబుతున్నారు. మండలంలో మిగిలిన గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తూ కుటుంబ పోషణకు ఆర్థికంగా సంపాదిస్తున్నారని, మరి తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి కూలీలకు కుటుంబ పోషణ పట్టించుకోని అధికారులు అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు కల్పించకపోతే మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

జగనన్నా.. సంపూర్ణ మద్యనిషేధం ఎక్కడ?

ఎన్నికల ప్రచారంలో పశ్చిమ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల

ప్రజాశక్తి -గోపాలపట్నం : అధికారంలోకి రాగానే దశలవారీగా మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే 2024లో ఓట్లు అడుగుతానని చెప్పిన వాగ్దానం ఏమైంది జగనన్న..? అంటూ ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల ప్రశ్నించారు. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో ప్రచార జోరు పెంచారు. ఆదివారం కాకరలోవ, చింతలకోన, క్రాంతినగర్, త్రినాథపురం, దుర్గానగర్,గుడివాడ అప్పన్న కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహం, విభజన హామీల అమలులో వైఫల్యం, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ప్రభుత్వరంగ పరిరక్షణ, కార్మికులకు ఉద్యోగ భద్రత వంటి అంశాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ ప్రచారం కొనసాగించారు. గాజువాక సిపిఎం ఎమ్మెల్యే ఎం.జగ్గునాయుడు, సిపిఎం జోన్ కార్యదర్శి పి పైడిరాజు, కాంగ్రెస్ నాయకులు పి నూకరాజు, రజియా బేగం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె సత్యంజనేయ,జి రాంబాబు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణపై

మాట తప్పిన పార్టీలను ఓడించాలి

ప్రజాశక్తి -సీలేరు : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని మాటిచ్చి ఓట్లు వేయించుకొని, మోసపుచ్చిన పార్టీలను ఓడించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి నాగేశ్వరరావు కార్మికులకు పిలుపు నిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశం జరిగింది. ముందుగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతా రాంబాబు, యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్కే.సుభాన్ మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, సెలవులు ఏడాదికి 15 రోజులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదని, మహిళలకు నెలసరి సమయంలో ప్రత్యేక సెలవులు ఇవ్వడం లేదని తెలిపారు. అనంతరం ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ఏపీ జెన్కో ఎమ్‌డి విజయానంద్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా పోరాడినప్పుడే విజయం సాధిస్తామని, అందుకు సిఐటియు వెన్నుదన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జెన్కో ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు ఇవ్వడానికి సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి శ్రీధర్ అంగీకరించడం జరిగిందని తెలిపారు. 2022 పిఆర్సి కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటి వరకు చెల్లించలేదని దాన్ని చెల్లించే విధంగా యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అహమ్మద్, స్థానిక సిఐటియు బ్రాంచ్ అధ్యక్షులు బి.లక్ష్మణ్, కార్యదర్శి టి.విష్ణుకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ రమణ, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

UNITED ELECTRICITY
CONTRACT WORKERS UNION

సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

నేడు కశింకోటలో మోడీ సభ

- పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - కశింకోట : ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం అనకాపల్లి జిల్లాకు రానున్నారు. కశింకోట మండలం రాజుపాలెం జాతీయ రహదారి పక్కన జరిగే ఎన్నికల బహిరంగ సభలో సాయంత్రం 5.45 నుంచి 6.35 గంటల వరకు ఆయన ప్రసంగిస్తారు. ఈ సభకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించే ఏర్పాట్లులో కూటమి నేతలు ఉన్నారు.

రాజుపాలెం జాతీయ రహదారి పక్కన జరగనున్న మోడీ బహిరంగ సభ సందర్భంగా ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్‌పి కెవి.మురళీ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటైనర్లు, టిప్పర్లు, లారీలు, భారీ వాహనాలను ట్రాఫిక్ దృష్ట్యా మళ్లిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం ఆరు గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు వుంటుందని పేర్కొన్నారు. ఆ ప్రకారం.. విశాఖపట్నం నుంచి తుని వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి. తుని నుంచి విజయనగరం, విశాఖపట్నం వచ్చే వాహనాలు తుని, రేగుపాలెం జంక్షన్, యలమంచిలి బైపాస్, అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం జంక్షన్, అసకపల్లి జంక్షన్ మీదుగా విజయనగరం, శ్రీకాకుళం, దేశపాత్రునిపాలెం నుంచి జాతీయ రహదారి మీదుగా విశాఖపట్నం చేరుకోవాలి. సబ్బవరం జాతీయ రహదారి మీదగా వచ్చే వాహనాలు అసకపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి బ్రిడ్జి, మునగపాక, పూడిమడక రోడ్డు, అచ్యుతాపురం జంక్షన్, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని వెళ్లాలి.

జిత్తుల మారి ఎత్తులు

- ప్రజలు, పార్టీల మధ్య చిచ్చురేపుతున్న బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్
- తారువ, చౌడువాడల్లో ఘర్షణలకు దిగిన కూటమి, వైసిపి కార్యకర్తలు
- కొద్ది రోజుల క్రితం జిఎస్‌టి అధికారిపైనా రమేష్ దురుసు ప్రవర్తన
- జిల్లాలో దెబ్బతింటున్న ప్రశాంతత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఏ బలమూలేని చోట విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయాలు చేసే బిజెపి ప్రయోగాన్నే అనకాపల్లి లోక్‌సభలో ఆ పార్టీ అభ్యర్థి సిఎం.రమేష్ ఎంచుకున్నట్లుంది. సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ పరిధిలో ఏనాడూ లేని వరుస గొడవలు ఈనాడు చోటుచేసుకోవడం వెనుక స్థానికేతరుడైన సిఎం రమేష్ కారణమన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. పల్లెల్లో పగలు పెంచి, కలిసిమెలిసి బతుకుతున్న ప్రజలను విడదీసి విషం చిమ్మే వ్యూహాలు పన్నుతున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. తమ పార్టీకి ఏ బలమూ లేకపోవడంతో టిడిపి ఓటును గట్టిపర్చుకొనేందుకు టిడిపి, వైసిపి మధ్య చిచ్చు పెడుతున్నట్లు కనబడుతోంది. ఈ పగలు, గొడవల్లో టిడిపి కార్యకర్తలు ఇరుక్కుపోతున్నారు. తనను టిడిపి, జనసేన శ్రేణులు సొంతం చేసుకొని పనిచేయడానికి రమేష్ ఈ ఎత్తులు వేస్తున్నట్లుందని సీనియర్ రాజకీయ నాయకులు అంటున్నారు. ప్రజలతో ఏ స్నేహమూ, బంధుత్వమూ లేకపోయినా, అధికారిక విధుల్లోనూ, కుటుంబ వ్యవహారాల్లోనూ ఆయన మితిమీరిన జోక్యం చేసుకోవడంతో కొత్త వివాదాలు ముదిరి జిల్లాలో ప్రశాంతత దెబ్బతినడానికి దారితీస్తున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయన గెలిచినా, ఓడినా ఇక్కడ ప్రజలకు అందుబాటులోవుండే వ్యక్తికాదు.. సమస్యలు అర్థం చేసుకొని పరిష్కరించే నాయకుడూ కాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

కొద్దిరోజుల క్రితం చోడవరం గాంధీ గ్రామంలో టైల్స్ షాపులో ఎపి స్టేట్ జిఎస్‌టి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారుల తనిఖీల వెనుక చోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ హస్తముందంటూ సిఎం రమేష్ బీభత్సం సృష్టించి జిఎస్‌టి అధికారుల చేతిలోని ఫైళ్లను లాక్కున్నారు. తనిఖీలు చేయకుండా విధులకు ఆటంకం కలిగించారు. ముత్యాల నాయుడు సొంతూరు తారువకు శనివారం రమేష్ కార్యకర్తలను వెంట బెట్టుకొని వెళ్లడంతో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య అక్కడ గొడవకు దారితీసింది. బూడి బావమరిది గంగాధర్ డ్రోన్‌తో తారువలో బిజెపి జెండా ఎగరవేయడంపై వారిద్దరి మధ్య జరిగిన గొడవ దగ్గర బంధువులు కావడంతో సద్దుమణిగింది. అయితే, ఈ వివాదంలోకి రమేష్ ప్రవేశించడంతో సమస్య రాజకీయమైంది.

కె.కోటపాడు మండలం చౌడవాడలోకి వైసిపి ప్రచార వాహనం రాకుండా టిడిపి కార్యకర్తలు అడ్డుకోవడంతో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య ఆదివారం తోపులాట జరిగింది. ఈ గొడవలు వెనుక సిఎం రమేష్ పాత్ర వుందన్న ప్రచారం బలంగా జరుగుతోంది. కూటమిలోని టిడిపి బలం, చంద్రబాబు సహచర్యం, కేంద్ర బిజెపి నాయకత్వ పరిచయాలతో దూకుడుగా వెళ్తున్న రమేష్‌తో ఎన్నికల్లో కొత్త సమస్యలు వస్తాయన్న టిడిపి నాయకుల అంచనాకు తగినట్లు పరిణామాలున్నాయి. బిజెపి బలపడితే తమ పార్టీ బలహీనపడుతుందన్న భయమూ వారిలో వ్యక్తమవుతోంది. ఒకవైపు జిత్తుల మారి ఎత్తులు వేస్తూనే, అభివృద్ధి తనవల్లే సాధ్యమన్నట్లు మాట్లాడి ప్రజలను రమేష్ నమ్మించచూస్తున్నారు.

వాస్తవానికి జిల్లా అభివృద్ధి, ప్రజలపై ఏ మాత్రం ఆయనకు చిత్తశుద్ధివున్నా 12 ఏళ్ల తన రాజ్యసభ పదవీకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మాట్లాడేవారు. సొంత గనులు కేటాయించాలని పట్టుబట్టేవారు. ఎన్ఎడబి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్ జాబితాలో చేర్చాలని అడిగేవారు. వెనుకబడ్డ ఉత్తరాంధ్రకు ఇవ్వాల్సిన నిధులు నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చూసేవారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, పునరావాసం, పరిహారానికి నిధులు రాబట్టేవారు. రాష్ట్ర విభజన చట్ట హామీలు అమలుకు బిజెపిపై ఒత్తిడితెచ్చేవారు. ఇలా తన కళ్లముందున్న సమస్యలను వదిలిపెట్టి, వీపు వెనుకనున్న సమస్యలను చూసి పరిష్కరిస్తానని ప్రజలను నమ్మించబూను కుంటున్నారు. తాజా పరిణామాలన్నీ పరిశీలిస్తే ప్రజలు వాస్తవాలు గుర్తెరిగి బిజెపి అభ్యర్థి సిఎం రమేష్‌ను ప్రజాతీర్పుతో సాగనంపకపోతే వారు సాగిలపడాల్సిన పరిస్థితులు ముమ్ముందు దాపురించనున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

శనివారం తారువలో ఘర్షణ పడుతున్న కూటమి, వైసిపి కార్యకర్తలు